# దాటిపోని పరిధి

పురాణపండ రంగనాథ్



నాలుగేళ్లయి డిగ్రీ పుచ్చుకున్న బసవరాజుకు ఉద్యోగం రాకపోవడం అతని తప్పు కాదు. అతను చేసిన తప్పల్లా ఒక్కటే: ఆశయాలకు తగిన ఉద్యోగం వస్తేకాని చేరకూడదనుకోవడం. ఇదమిత్థమైన ఆశయాలు చుట్టూ అల్లుకోవడం, ఇది అతని లోపలి తప్పు. ఇక బయటి తప్పు — ఉద్యోగ నియామకాలకు డబ్బు అవసరమవడం.

'విధి అనుకూలించలేదు. పాపం ముత్యంలాంటి కుర్రాడికి ఉద్యోగం రాకపోవడమేమిటి?' అన్నారు కొందరు. 'ప్రయత్నిస్తే రాకపోదు. ఎందుకో రావడం లేదు. అంతా మేస్పట్'—అని మూతులు విరిచారు కొందరు.

'పోతే సరి! ఉద్యోగం, సద్యోగం అక్కరలేదు'—ఆయన తెచ్చి పారేస్తున్నాడు'—అని కొందరు బుగ్గలు నొక్కుకున్నారు. అతడినే యెత్తిపొడిచారు.

ఎవరేమనుకున్నా బసవరాజు పట్టించుకోక తిరుగుతున్నాడు 'యిమ్యూనిటీ డెవలప్' చేసిన దోమ డి.డి.టి. పౌడరు మీదే దిగంబర నాట్యం చేసేటట్లు.

అన్నిరకాల ఉద్యోగాలకు సిద్ధపడగల మనస్తత్వం అతనికి లేదు. తను కోరిన ఉద్యోగం వస్తేకాని చేరనంటాడు. ఆ ఉద్యోగాలు అతన్ని వరించాలనుకొని విడాకులిస్తున్నాయి. వరకట్నాన్ని నిరసించే యువతరం తప్పక నెలకు నెల కట్నాలు పుచ్చుకుంటున్నట్లు, అలాగే ఉద్యోగాలకు ఫలానా అర్హతలుండాలనే నిర్ణయాలున్నా 'రెకమెండేషన్' లేనిదే ఆ ఉద్యోగాల నియామకం జరగదు. అందుచేత సదరు ఉద్యోగాలకు బసవరాజు సరిపడినా, ఉద్యోగ కన్యను వరించే ఆర్థికస్థోమతు, బసవరాజుకు లేకపోవడంవల్ల అతను అసమర్థుడవుతున్నాడు.

'ఎందరో యెందుకూ పనికిరానివాళ్లు ఉద్యోగాలు సంపాదిస్తున్నారు, ఏమిటో నా బ్రతుకే యిలా అయింది' — నాలుగు రోజులకొకసారి యేదో ఒక సందర్భంలో తల్లి దగ్గరో, తండ్రి దగ్గరో బసవరాజు

వాపోశగానే వుంటాడు.

'ప్రస్తుతానం అలా యిదవకు వస్తుంది. కాలం కలిసివస్తే యేదీ ఆగదు ధైర్యంగా ఉండాలి' - లక్ష్మి తండ్రి బసవరాజును బుజ్జగించి, ధైర్యం చెపుతూనే వున్నారు.

'మావయ్య ప్రయత్నిస్తాడేమో మద్రాసు వెళతాను'—ఒకనాడన్నాడు బసవరాజు.

'మన రాష్ట్రంలో రాలేదుకాని—తమిళనాడులో యేం వస్తుందిరా! పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు' - అన్నాడు తండ్రి

అదీ నిజమే— తమిళనాడులో 'జాబ్' రావాలంటే ఆ రాష్ట్రంలో చదివినవాడై వుండాలి. అందులో ఈ మధ్య అక్కడా ఆంధ్రులకంత ప్రాధాన్యం యిస్తున్నట్లు లేదు. కొన్ని కాలేజీలలో తెలుగే తీసేస్తామనుకుంటున్నారట. భాషా ప్రయుక్త రాష్ట్రాలు నెత్తికి కొరివవుతాయనుకుంటే అసలు యేర్పాటు చేయకపోదురేమో!

మద్రాసులో ఉద్యోగం చేస్తున్న బసవరాజు మేనమామ విజయవాడ బదిలీ అయి వచ్చిన మూడు నెలలకు వుత్తరం వచ్చింది.

'మద్రాసు రావడమైతే దూరమని వంక పెట్టావు. పదిబారల్లో ఉన్నాం, ఒక్కసారి రాకపోతే యెలా? అంతకంతకు మన మధ్య రాకపోకలు తగ్గిపోతున్నాయి. ఇక యిలా అవకూడదు, అందుచేత బసవరాజును పంపండి.'

మేనమామ రాసిన వుత్తరం బసవరాజును ప్రేరేపించింది. కాని పరిస్థితులు అనుకూలించక విజయవాడ వెళ్లలేదు. పదిరోజులతర్వాత మరొక ఉత్తరం వచ్చింది.

'డిగ్రీపట్టుకొని ఆ పల్లెటూర్లో కూర్చుంటే యేంలాభంలేదు. అంచేత వెంటనే పంపండి. ఇక్కడేమైనా ప్రయత్నిస్తాను.'

ఈసారి మేనమామ రాసిన ఉత్తరం బసవరాజులో పట్టుదల పెంచింది. విజయవాడ వెళ్లాలనే తపన బయలుదేరింది. దానితోడు బసవరాజు పంపిన చిత్రం ఒకటి ప్రసిద్ధవారపత్రిక ప్రచురించింది. సదరు పత్రికవారు పంపిన పారితోషికంతో విజయవాడ వెళ్లాడు. మావయ్యతో విజయవాడలో గడపడం సర్దాగా వుంటుందనుకున్న బసవరాజు ఆశ నిరాశ అయింది. సదరు మావయ్య ఆఫీసు పని మీద హైదరాబాదువెళ్లి రెండురోజులైంది. ఇంకో వారానికి కాని రాడు.

చిన్నతనంలో మావయ్యదగ్గర అలవాటుంది. ఇప్పుడు అత్తయ్య దగ్గర కొంచెం సిగ్గుపడుతున్నాడు. స్వతహాగా బసవరాజు మొహమాటస్థుడు అయినా మేనత్త ఆప్యాయంగానే చూసింది. పిల్లలు బావ వచ్చాడని చంకలెగర వేశారు. సలు పట్నవాసపు పిల్లలకు చుట్టాలొస్తే గొప్పగా వుంటుంది.

గుట్టుగా సంసారాలు చేసుకొనే మధ్య తరగతి సంసారాలవాళ్లు పట్టణాలలో పిల్లల కోర్కెలు తీర్చడం చాలా కష్టం. చుట్టాలొచ్చినప్పుడు వాళ్లతోపోవచ్చుననే ఒక ఊహ వాళ్లకుంటుంది. అలాగే బసవరాజుతో మేనమావ పిల్లలు విజయవాడ తిరగసాగారు వాళ్లతో కొంచెం యిబ్బందిగా వున్నా బసవరాజు మొహంమాటంచేత యేం అనలేకపోతున్నాడు. రోజా సాయంత్రం పార్కు కెళుతున్నాడు. కూడా పిల్లల్ని తీసుకుపోతున్నాడు. వాళ్లు అవీ యివీ కావాలంటే కొనిస్తున్నాడు. జేబులో డబ్బులు నాలుగూ అయిపోయాయి. మావయ్య కాంపు పొడిగించినట్లు లెటరు వ్రాశాడు. బసవరాజు గుండెల్లో బండ రాయి పడింది. అయినా చిరునవ్వుతోనే మసులుతున్నాడు. అన్నప్పుడూ చిరునవ్వు మంచిది కాదని అప్పుడనిపించింది అతనికి.

'ఈ ప్రయివేటు ఉద్యోగాలింతే నాయనా! అందుకని నీవు గవర్నమెంటు ఉద్యోగం లోనే చేరు. పదింటికి వెళ్లి, సాయంత్రం నాలుగు కాకుండా యింటికి వచ్చే అవకాశ ముండే 'జాబ్'లోనే చేరు—చూశావా మీ మావయ్య ఉద్యోగం' ఓనాడు మేనత్త భోజనాలదగ్గర బసవరాజు కుపదేశించింది.

మేనత్త యిచ్చిన ఉచిత సలహాకు లోపల నవ్వుకున్నాడు ఉద్యోగాలే కష్టంగా వున్న యీ రోజుల్లో సుఖమైన గవర్నమెంటు ఉద్యోగమంటే మాటలో పనా? అదీ గాక ఒకరికి అమ్ముడుపోయాక కష్టమేమిటి? సుఖమేమిటి? వాటిని మరిచిపోయే ఉద్యోగంలోకి రావాలి.

విజయవాడలో వున్న నాలుగు రోజులు జాలీగా గడపాలనుకున్నాడు, కాని యిదేం ఖర్మమో లోటు బడ్జెట్. మావయ్యింటే యింత బాధపడకపోను.

డబ్బు విలువ బాగా తెలిసింది బసవరాజుకు, ఇంటిదగ్గర వున్నప్పుడు సుష్టుగా భోజనం చేసి, రూపాయో, అర్థో లక్ష్మి దగ్గర తీసుకోవడం తిరగడం—అందులో పల్లెటూర్లో పెద్ద ఖర్చేం కాదు, మరి విజయవాడలోనో...

ఇది విజయవాడ కాదు — ఆంధ్రాలో చిన్న అమెరికా, రూపాయి కాగితాలు ఉల్లిపాయి పొరల్లా యెగిరిపోతున్నాయి.

ఏమీ తోచక ఆనాళ సాయంత్రం పిల్లలు యింకా స్కూలునుంచి రాకుండానే షికారు బయలుదేరాడు. గతుకుల యేలూరు రోడ్డు మీద నడిచి, సెంటర్‌లోకి మళ్లాడు, రోడ్డెలావుందో తెలియకుండా జనం. రంగు రంగుల అలంకారాలతో వయారుబు నడిచిపోతున్నారు. ఎవరి పనుల్లో వారు హడావిడిగా వున్నారు. ఆ గడ బిడనుండి తప్పుకొని సరాసరి పార్కులోకొచ్చి కూర్చున్నాడు అది పేరుకు పార్కే కాని పార్కుకుండాల్సిన కనీసపు లక్షణాలు లేవు, ఉన్నదల్లా ఒక్కటేచుట్టూ గోడ. లోపల సంస్కారం లేకుండా పెరిగిన గడ్డి మరి విజయవాడ పార్కులలా వుండాలేమో! లేకపోతే విజయవాడకు ప్రత్యేకత లేదు.

పల్చ పల్చగా జనం పార్కు పచ్చికలో కూర్చుంటున్నారు. ఈ వారం రోజుల్లోనూ బసవరాజుకు ఆ పార్కు బాగా పరిచయమైంది. మామూలుగా తను కూర్చుంటున్న చోటులోకొచ్చి కూర్చున్నాడు బసవరాజు. పిల్లలు ఆటలాడు తున్నారు, రోజా వచ్చే ప్లీడర్‌గారూ, సాహెబ్ వచ్చి రాజకీయాలలో కీచులాట ప్రారంభించారు, ఎదురుగావున్న 'లక్ష్మీ జనరల్‌స్టోర్స్' మేడ మీద ఖరీదైన కోకలు అటు యిటు తిరుగుతున్నాయి. ఆ కోకల తాలూకు ఆడవాళ్ల చేతుల్లో 'వ్యానిటీ బాగ్'లు అందని అదృష్టంలా ఊగిసలాడు తున్నాయి. అవన్నీ రోజా బసవరాజు చూస్తున్నవే. రోజా కొక కొత్త అందం ఆపాదించు కుంటున్నాడంతే. ఇంతలో అతని ప్రక్కనే నల్లగా, పొడుగ్గావున్న యువకుడు వచ్చి కూర్చున్నాడు. తన వైపే చూస్తున్న బసవరాజును అతనూ చూశాడు, చిరు నవ్వు నవ్వాడో లేదో కాని నవ్వినట్లని

పించింది.

పదేళ్ల కుర్రాడు బసవరాజా దగ్గర కొచ్చాడు. మాసిన కాకీ నిక్కరు, బాగా మాసిన గళ్ల చొక్కా వేసుకున్నాడు. శరీరం బలంగానే వుంది. జుట్టు మాత్రం చిందర వందరగా రేగిపోయింది.

'అగ్గిపెట్టె యివ్వండి సార్!'—ఆ కుర్రాడు బీడీ నోట్లో పెట్టుకుంటూ అడిగాడు. 'ఉందా' అని కాదు 'యివ్వండి' అంటున్న ఆ కుర్రాడి ధైర్యానికి, తెగింపుకు ఆశ్చర్యం వేసింది. కాలేజీలో చదివిన నాలుగేళ్లలోనూ యెప్పుడూ అగ్గిపెట్టె జేబులో పెట్టుకోవాల్సిన అవసరం లేకపోయింది బసవరాజుకు.

'లేదు —

'హోష్! అగ్గిపెట్టె లేదా? సూటూ బూటూ వేశారు'—హేళనగా అని ఆ కుర్రాడు ప్రక్కనున్న నల్ల యువకుని వైపు వెళ్లాడు. బసవరాజా తన బట్టలు చూసుకొన్నాడు. కాటన్ పాంట్, కాటన్ షర్ట్, హవాయి స్లిప్పర్స్—యివి తన దుస్తులు. అవి ఆ కుర్రాడికి సూటూ బూటూ నన్నమాట! ఇలా ఆలోచిస్తున్న బసవరాజదగ్గరగా నల్ల యువకుడు జరిగాడు.

'ఇంత కుర్రాడున్నాడు — చూడండి యిప్పుడే యిలా కాలుస్తుంటే యేమయిపోతాడంటారు—మనం ఆ వయస్సులో యిలా కాల్చామంటారా?'—నల్ల యువకుడు దూరంగా నిలబడి బీడీ కాల్చుకుంటున్న పదేళ్ల కుర్రాడినీ, బసవరాజునూ మార్చి మార్చి చూస్తూ అన్నాడు.

వారం రోజులనుండీ యీ మహానగరములో, యీ పార్కులో యింతవరకూ తన నెవరూ పలకరించలేదు.

ఈ కాలం కుర్రకారు గురించి అలాంటి భావాలు బసవరాజుకు ఉన్నాయి. అదే ఆ యువకుడు వెలిబుచ్చాడు. కుర్రకారు పాడైపోయారన్నట్లు తలూపాడు బసవరాజా.

'బొత్తిగా భయం, భక్తి లేవు సార్! బళ్లోకి వెళ్లమని యింట్లో పంపిస్తారు, వీళ్లిలా పార్కులూ, హోటళ్లూ సినిమాహాళ్లూ తిరుగుతుంటారు. ఈమధ్య ఈ సైజు కుర్రాళ్లు బ్రాకెట్‌కూడా ఆడుతున్నారు, ఇలాంటి పిల్లల భవిష్యత్తు యేమిటి?'—ఆ యువకుడు గుక్క తిప్పుకోకుండా చెప్తున్నాడు.

'ఇలాంటి పిల్లల చేతుల్లో ఈ దేశం భవిష్యత్తెలా ఉంటుందంటారు?'—బసవరాజా ప్రశ్నించాడు.

'ఏమిటో మీ పిచ్చి కాని యిప్పుడు పాలిస్తున్నవాళ్లు కుర్రాళ్లటండీ! ఇంతకన్నా యేం పాడు కావాలి. కుక్క చింపిన పుల్లాకు మనదేశం. యిక ముందు మనం చింపుకొనే కంచమే అవుతుంది ఈ దేశం. ఉదాహరణకు తెలంగాణా గొడవ యేమిటి చెప్పండి.'

'నిజమే—ఇది కాల ప్రవాహం. ఆ—మీరేం చేస్తుంటారు?'—ఇంకా మాట పొడిగిస్తే రాజకీయంలోకి పోతాడేమోనని బసవరాజా ప్రసంగాన్ని మళ్లించాడు.

'యమ్. బి. టి. లో క్లార్కుగా పని చేస్తున్నాను, మరి మీరు?'

'తిని తిరుగుతుంటాను. డిగ్రీ అనే జోలి చేతిలో పెట్టుకొని యెక్కే ఆఫీసు, దిగే ఆఫీసు. ఉద్యోగ భిక్ష పెట్టేవారే లేరు. భిక్షాటనానికి రికమెండేషన్ కావాలి మరి.'

బసవరాజా యీ మాటలు హాస్యంగా అన్నాడన్న మాటేగాని అవి అతను లోపల పడుతున్న బాధకు నిదర్శనాలు.

ఏడుపును, బాధను హాస్యంగా మార్చి వెలిబుచ్చడం ఈ శతాబ్దపు 'ఫాషన్ల'లో ఒకటి. ఆ యువకుడు నవ్వాడు. తనకు యిద్దరు తమ్ముళ్లనీ, ఒక చెల్లెలనీ, విజయవాడకు దగ్గర పల్లెటూరనీ చెప్పాడా యువకుడు.

కాకినాడలో చదువుకున్నాననీ, కాకినాడ సమీపంలోని గ్రామం నివాసమనీ బసవరాజా చెప్పాడు. ఫలానా ఫలానా కులం అనే పేరు మాత్రం యిద్దరూ లోపల అనుకున్నారు. నేటి యువతరాన్ని తనలో అనుకొనే అంశాలే యెక్కువ. నాటకాలలో చాలా మంది నటులకు చాలా తక్కువ సందర్భాల్లోనే స్వగతాలుంటాయి. అందుకు భిన్నం నేటి యువతరం. ఇదొక నాగరికతా భాగం.

'ఉద్యోగం చేస్తున్నారు కదా! పెళ్లి చేసుకోలేదా?'


ఆరోగ్య సౌభాగ్యములకు
మహిళలు ఆధారపడునవి
ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో
**లోధ్ర**
శిశు పోషణకు, సుఖ ప్రసవమునకు
**గర్భరక్షక**
నెలసరి నొప్పులకు, మలబద్ధకమునకు
**మాదీఫల రసాయనం**
ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి
**సౌభాగ్యశొంఠి**
68 సంవత్సరములకు పైగా
ప్రసిద్ధి పొందిన ఔషధములు.
**కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్**
మదరాసు-14.
ఏజెంట్లు
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ.



వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టర్
**కాయిల్**

(గ్యారంటీతో)
3 బ్యాండ్, ఆల్ వరల్డ్
పోర్టబుల్ ట్రాన్‌సిస్టర్.
ట్రాన్‌సిస్టర్, నెలకు రు. 5/- వంతున చెల్లించి పొందండి. ధర రు. 165. ప్రతి గ్రామము మరియు టౌనుకు పంపవచ్చును.
**VIRLA AGENCIES (30)**
**Roop Nagar, Delhi—7.**



**దేహపుష్టికి ఆరోగ్యానికి**
పండిత-డి గోపాలాచార్యులవారి
**జీవామృతం**
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
**ఆయుర్వేదాశ్రమం**
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17.

చిలవలు పలవలుగా సాగిపోతున్న ప్రసంగానికి మూలం నిర్మించే ఆలోచనలో బసవరాజు ఉడిగాడు.

'ఈ కాలం అమ్మాయిలమీద నాకు నమ్మకం లేదండి. ఇంతోటి నూట యాభయి రూపాయల జీతంతో గడవడం కూడా కష్టం'—

సామాన్య మధ్యతరగతి యువతరం ఈనాడనుభవిస్తున్న వేదనే అతనూ పడుతున్నాడు.

కోరికలు రేపే వయస్సు, సరిపడని జీతాలతో సతమతమవుతూ నేటి యువతరం పెళ్ళి మీద భయం పెంచుకుంటోందేమో ననిపిస్తుంది.

'అవునండీ! అమ్మాయిలు కూడా నాగరికత అంటూ దుబారాతనాన్ని అలవాటు చేసుకుంటున్నారు. సభ్యతా, సంస్కారం అనే పేర్లే కాని ఆచరణలో అవి కనబడవు. అసలు మ మేమిటనే ధ్యాస స్త్రీ పురుషులలో తగ్గి 'వ్యానిటీ'లో కొట్టుకుపోతున్నారు. అందుకే యీ దుర్దశ'— బసవరాజు నిగ్రహంగా, నిదానంగా అన్నాడు. అతను చెప్తున్నంతసేపూ ఆ యువకుడు ఆశ్చర్యంగా విన్నాడు. బసవరాజు వాగ్ధాటి అలాంటిది.

'అసలు 'కారక్టర్'మీద నమ్మకం లేదు' ఆ యువకుడు పెదవి విరిచాడు.

'అలా 'జనరలైజ్' చేయకండి. మంచీ చెడూ రెండూ ఉన్నాయి అందరిలో'

ఆ యువకుడు కొంచెంసేపు మాట్లాడలేదు. తరువాత అతడే అన్నాడు.

'ఇంకా మీ హాబీలేమిటి?'


'బొమ్మలు వేస్తుంటాను. ఈ మధ్య పత్రికలో నాగరిక యువతి చిత్రం వేశాను చూసే వుంటారు.' బసవరాజు చిన్నగ నవ్వాడు.

'ఓహో ఆ కటింగ్ వుందా!'—

'ఇంటిలో పెట్టి వచ్చా. రేపు తెస్తాను, రేపు వస్తారుగా'—

'ఆ — ఆ! మీకోసమైనా తప్పక వస్తాను. ఈ వూరొచ్చి మూడు నెలలైంది. మీలా మనస్సు విప్పి మాట్లాడిన వారే లేరు'—

'నేను మాత్రం వారం రోజుల్నుంచి యిక్కడకు వస్తున్నాను. ఎవ్వరూ పలకరించలేదు. ఎవరి గురించి పట్టించుకోక




కోసడం పట్టణాలకే చెల్లింది లెండి'—

ఇద్దరూ నవ్వుకున్నారు. ఆ నగరంలో తనను ఎవరు పలకరిస్తారు? ఎందుకు పలకరిస్తారు? అయినా ఎవరో ఒకరు పలకరించాలనే తపన బసవరాజుది.

'ఇవాళ కలుసుకున్నాం. మన స్నేహం యిలాగే పెరగాలి'—ఆ యువకుడు ఊహా లోకాల్లో తిరుగుతూ అన్నాడు.

'తప్పకుండాను. ఈ రోజుల్లో బంధువులకన్న స్నేహితులే నయం. మంచి స్నేహితు లుండాలి కాని' — బసవరాజు అన్నాడు.

'నిజం ఫ్రెండ్! నాకీ ఉద్యోగం మీ వంటి మంచి మిత్రుడువల్లే వచ్చింది — మంచి స్నేహితుడంటే జ్ఞాపకం వచ్చాడు— నా ఫ్రెండు ఒకడికి ఫిలిమ్ కంపెనీ వుంది. అందులో యేమైనా ఖాళీలున్నాయేమో ప్రయత్నిస్తాను'— ఆయువకుడు చిగిలి కళ్లను వింతగా కదిలిస్తూ అన్నాడు'

నిజంగా సినిమా పరిశ్రమలో చేరి నంత ఆనందం కల్గింది బసవరాజుకు. అందులో 'ఆర్ట్ సైడ్'లో శ్రమించి, ఉన్నత ప్రమాణాలు సాధించడాని కి యీ కాలంలో సినిమా పరిశ్రమ ఒకటే అనే అభిప్రాయం బసవరాజుకుంది. కాని యే అవకాశం లేకుండా ఆరంగంలో చేరడం కష్టం. చేరినా మంచి 'ప్రొడ్యూసరో డిస్ట్రిబ్యూటరో?' అండగా నిలవకపోతే యెముగూ బొదుగూ ఉండదు. బసవరాజు తన అభిప్రాయం చెప్పాడు.

'మీరు మీ వూళ్లో కూర్చుంటే అవకాశాలు రావు మద్రాసు పోవాలి, ప్రయత్నించాలి' ఆయువకుడు బసవరాజు ఆలోచనను సమర్థించాడు కాని అతడి అలసతను నిరసించి, కర్తవ్యం వుపదే శించాడు.

'ఏ సోర్సూ' లేకుండా మద్రాసు వెళ్లడం, అక్కడ కూర్చుని యింటి దగ్గరనుండి డబ్బు తెప్పుకుని షికారుగా తిరగడం నాకు చేతకాదు. అంత డబ్బూ లేదు'—

'అదీ నిజమే లెండి. అందుకే మా ఫ్రెండ్ కంపెనీలో ప్రయత్నిద్దాం'—

'ఇంక లేద్దాం! నా కోసం మావాళ్లు చూస్తుంటారు'—అని లేచాడు బసవరాజు.

# దాటలేనిపరిధి

ఎంత అదృష్టవంతులు—యింటిదగ్గర మీకోసం కూర్చునే వాళ్లున్నారు. మాలాంటివాళ్లకు హోటల్లో ఆప్యాయత ఖరీదుకు దొరుకుతుంది. అదీ రేషన్!—

అంటూ యువకుడు లేచి పాంటు దులుపుకొని సర్దుకొన్నాడు.

'గుడ్ నయిట్! రేపు యిక్కడే తప్పక కలుద్దాం'—అని యిద్దరూ తమ తమ దారులు పట్టారు.




'పదివిముషాల పరిచయంతో బాగా సన్నిహితమైన అతడు బలహీనుడా? తను బలహీనుడా! రెండు బలహీనతలో, రెండు ఆశయాలో, కలిస్తే కాని యిద్దరిమధ్య స్నేహం జరగదు.

మరునాడు యిలాంటి ఆలోచనలతో బసవరాజు పార్కుకువచ్చాడు. జేబులో పెట్టుకొనివచ్చిన తను గీసిన బొమ్మ నాలుగైదుసార్లు చూసుకున్నాడు. నిముషాలు గడుస్తున్నాయి. అతను రాలేదు. రోజూచూసే దృశ్యాలమీద యివాళ అతడి దృష్టి లేదు. ఆ యువకుడు రావాలనే ఆశ తప్ప మరొకటి చూడాలనే ధ్యాస లేదు. కొంత సేపటికి ఆయువకుడు 'టకప్' చేసుకొని వచ్చాడు.

'హలో ఫ్రెండ్'—అన్నాడతను.

'హలో'—విష్ చేశాడు బసవరాజు.

'మీరే ముందు వచ్చేశారే!'

'సాయంత్రం యెప్పుడవుతుందా? అని కాచుక్కూర్చున్నాను. కాగనే వచ్చేశాను.'

'ఫ్రెండంటే అలాగుండాలి—సినిమాకు వెళదాం'—యువకుడు కూర్చోకుండానే అన్నాడు.

'ఇంట్లో చెప్పలేదు.'

లోపల సినిమాకు వెళ్లాలనియున్నా జేబులో డబ్బులు లేకపోవడంవల్ల బసవరాజు తప్పించుకోవాలని అన్నాడు.

'ఏంటి ఫ్రెండ్! మీరేం చిన్నపిల్లలా! ఇంక డబ్బుగురించి ఆలోచించకండి— మా ఫ్రెండ్ పిక్చర్ ఆడుతోంది. పాస్ తీసుకువచ్చాను—లెండి. 'లేట్' అవుతుంది'—యువకుడు తొందర చేశాడు.

జేబులోవి బొమ్మ జేబులోనే వుండి పోయింది. అది చూపించాలనుకున్నా, చూపించే ధైర్యం చేయలేక పోయాడు బసవరాజు. ఆ యువకుడూ బొమ్మ గురించి ప్రశ్నించలేదు. గతం గతమే— ప్రస్తుతం అనుభవించు. నిన్నటి మాటలు యివాళ యెందుకు? అనే మనస్తత్వం ఆ యువకుడిది అనుకున్నాడు బసవరాజు.

'ఇంకా ఆలోచనే! లెండి'—'అని అతడు బసవరాజు చేయి అందుకొని లేపాడు. ఇద్దరూ రిక్షాయెక్కారు.

రిక్షాకు యివ్వడానికికూడా డబ్బులు లేవు. కిళ్లీ వేసుకున్నా యివ్వడానికి పది పయిసలు లేవు. అలాంటి పరిస్థితిలో

# దాటలేని పరిధి

'ఫ్రీ'గా సినిమాకెళ్ళడమంటే బసవరాజుకి బాధే పైకి గంభీరంగా, ఆనందంగా కనబడుతున్నాడంతే.

రిక్షా మువ్వలచప్పుడు చేసుకుంటూ ముందుకు సాగుతోంది. సాయంకాలం విసిరిన ఊదా రంగులో నగరం వింతగా మెరుస్తోంది. రోడ్డుమీద నడిచిపోతున్న అమ్మాయిల గురించి అతడేదో చెప్తున్నాడు. బసవరాజు పరధ్యానంగా వింటున్నాడు.

గుంటూరులో తను చదువుకొనేటప్పుడు అక్కడి హాస్పిటల్ నర్సులతో తనకు పరిచయముండేదనీ, యిప్పటికీ వాళ్ళంటే పడి చస్తారనీ, మారేజీకన్న యిదే బాగుందనీ ఆయువకుడు గర్వంగా చెప్పుకుంటుంటే బాగుండదని బసవరాజు నవ్వేడు. అదీగాక అతనిప్పుడు అతని పరిధిలో నే కొంచెం సేపుండాలి. అంతకంతకు శ్రుతి మించుతున్న అతని వాగుడుకు బసవరాజు బుర్ర తిరిగిపోతోంది.

స్త్రీలంటే కొన్ని నిర్దిష్ట అభిప్రాయాలున్న మనిషి బసవరాజు. సంఘంలో స్త్రీకి ప్రత్యేక రక్షణ, గౌరవం వుండాలనే ఆలోచన అతనిది. నేడు ఉద్యోగాల పేరుమీద ఆ స్త్రీలనుభవిస్తున్న సుఖశాంతులు గురించి వేరేజువేసి బసవరాజు భయపడతాడు. ఇతరదేశాల్లో యేమో కాని యీ దేశంలో స్త్రీలు వుద్యోగాలకు రావడం వల్ల వారి గౌరవమర్యాదలు పాడుచేసుకున్నవారేకాక, నిరుద్యోగసమస్యకు కొంత బాధ్యులవుతున్నారనే వాదన బసవరాజుది.

ఆర్థిక పరిస్థితులదృష్ట్యా వుద్యోగాలకొచ్చే స్త్రీలను పరిషత్తు ప్రెసిడెంట్లదగ్గర్నుంచి, అవకాశంవున్న ప్రతివాడు లొంగదీసుకోవడం, లొంగకపోతే వుద్యోగం ఈయకపోవడం చేస్తున్నారీ రోజుల్లో. ఇలాంటివి ఈ సమాజం సుస్థిరతకు భంగమనే దృఢవిశ్వాసం గలవాడు బసవరాజు.

హాస్పిటల్స్‌లో నర్సులుగా పనిచేసే వాళ్ళను అవసరాలు తీర్చుకొందుకు వాడుకొనే వాళ్ళనుగురించి బయట హాస్యంగా హేళనగా మాట్లాడేవాళ్ళంటే అసహ్యం, [illegible] వున్నాయి బసవరాజుకు. కాని అతడి అభిప్రాయాలు వెలువరిస్తే పరిహసిస్తారు. పెద్దగా ఛాందసుడని నిరసిస్తారు. అందుకని సామాన్యంగా బసవరాజు అలాంటి ప్రసంగాలు తేడు. అలాంటి మనుష్యులతో మాట్లాడడు. అందుకే అతని జీవితపరిధి ఈ శతాబ్దిలో చాలా చిన్నది.

నిన్న పార్కులో కాలం అమ్మాయిలమీద, వాళ్ళ కారక్టర్‌మీద నమ్మకం లేదన్న పెద్దమనిషి యితడేనా అనిపించింది బసవరాజుకు. తన మనస్సునుబట్టి, తన అనుభవాలనుబట్టి లోకాన్ని [illegible], విమర్శించడం మనిషి బలహీనత. బసవరాజు వింటూ కూర్చున్నాడు.

'మీరుకూడా యిక్కడ 'జాబ్' చూసుకోండి—ఇద్దరం ఒకేరూములో హాయిగా గడపవచ్చు'—యువకుడు ఆశగా అన్నాడు.

'తప్పకుండాను'—

నీలాంటివాడితో నాకు సరిపడదు అని నిక్కచ్చిగా చెప్పలేక బసవరాజు ముక్తసరిగా అని మందహాసం చేశాడు. ఇంతలో హాలు రానేవచ్చింది. ఆ యువకుడు రిక్షా డబ్బులిచ్చి మానేజర్ దగ్గరకు వెళ్ళాడు. తిరిగి అతడు వచ్చేవరకు బసవరాజు తన అసహాయతపరిస్థితి. యింట్లో అత్తయ్యవాళ్ళూ యేమనుకుంటారోననే ఆలోచిస్తుండిపోయాడు. పదినిముషాల్లో అతడు తిరిగివచ్చాడు, బసవరాజును తీసుకొని 'బాల్కనీ' లోకి వెళ్ళాడు. తమ వెనకాముందూ 'అరిస్టోక్రాటిక్' లేడీస్ అండ్ జంటిల్‌మన్ కూర్చున్నారు. అందరూ అధునాతనంగా అలంకరించుకున్నవాళ్ళే. తమ ప్రక్క కూర్చున్న భర్తల చెవుల్లో మధ్యమధ్య గుసగుసలాడుతున్న వాళ్ళే. అదొక ఆనందం. ఆ ఆనందం మరొకచోట యెలా వస్తుంది. కష్టంలో భాగం పంచుకోవడం వేరు, సుఖంలో యే అసూయ లేకుండా సుఖం పంచుకోగల భాగస్వామి భార్య ఒక్కతే. స్త్రీకి భార్యగా వుండే అధికారం గౌరవం అది

'చూడు ఫ్రంట్! ఆవిడవొళ్ళు బన్‌రొట్టిలాగుంది' — యువకుడు బసవరాజు చెవిలో అన్నాడు. బసవరాజు యిబ్బంది పడ్డాడు. ఇలాగే పిక్చర్ నడుస్తున్నంతసేపూ యువకుడు కామెంట్స్ విసురుతున్నాడు.

సభ్యసమాజంలో మసలడం ఆ యువకుడికి చేతకాదు. అతడితో కూర్చోవడం బసవరాజుకు బాధగానే వుంది. బట్టలు షోకుగా వేసుకోవడంలోనే నాగరికత పెరిగింది కాని, మానసిక సంస్కారాలు కొందరికే పరిమితమయ్యాయి.

ఇంటర్వెల్ అయింది. లైట్లు వెలిగాయి. బసవరాజు హాలంతా కలయజూశాడు. ఒకే థియేటర్. ఒకటే ఆనంద సాధనం. ఆ ఆనందాన్ని అందరూ సమంగా ఆస్వాదించగలరా అంటే ఆయా మనుష్యుల మానసిక పరిణతి మీద ఆధారపడి ఉంటుంది. హాలులో మనుష్యుల ఆర్థిక అంతస్థులు వేరు, మానసిక అంతస్థులు వేరు

తొంభై అయిదు పైసల టికెట్ నేలలో కూర్చున్నా జ్ఞానం వుండొచ్చు, బాల్కనీలో యిమిడి కూర్చునే వన్నెలాడికి ఆ సంస్కారం పరిగణించే జ్ఞానం వుండకపోవచ్చు. టిక్కెట్టు కొనుక్కొనుకుండే స్తోమతు సభ్యసమాజంలో మసలేందుకు లేనివాళ్ళు కొందరు ఎంతభేదం? మానసిక వికారమున్నవాళ్ళంతా యేకమైతే!—బసవరాజు ఆలోచనలు 'ఫాన్'లా, దీపం చుట్టూ పురుగుల్లా పరిభ్రమిస్తున్నాయి. పురుగులు తిరగడానికి ఆధారం దీపం. 'ఫాన్' తిరగడానికి విద్యుత్తు. ఒకటి కోరిక మరొకటి ధర్మం.

బసవరాజుకు ఆలోచించడం ధర్మం: అతని ఆలోచన మనిషి ఆధారంగా పరిభ్రమిస్తుంది.

ఆ యువకుడు మాత్రం అమ్మాయిల మీద, వయ్యారుల యవ్వన సోయగాల మీద 'కామెంట్స్' విసురుతున్నాడు. బసవరాజు తప్పక విని నవ్వుతున్నాడు. (బాధగా)

కొంచెం లావుగావున్న ఆమె పిరుదులు తిప్పుకుంటూ 'లైన్' దాటి వస్తోంది. బసవరాజు కాళ్ళు లోపలకు ముడుచుకున్నాడు. యువకుడు ఆమెను దగ్గరగా రానిచ్చి, గిరగిర వలయాలు తిరుగుతున్న ఆమె పిరుదులకు —తగిలేలా కాళ్ళు ముందుకు చాచాడు. ఆమె—యిబ్బందిగా చూసి ముందుకు పోయింది. అదే క్రింది తరగతిలో ఐతే చాచి కొడుతుంది. మరిక్కడ సభ్యతలెక్క అడ్డు.

—'తిండి కొంచెం తగ్గించాలి — శేష

పోతే 'యెక్సర్‌సైజ్' చేయాలి!—యువకుడు 'జోక్' వేశాడు. ఈ మాట విన్న యిద్దరు ముగ్గురు కుర్రాళ్ళు—'బ్రహ్మాండం గురూ!' అని పకపక నవ్వారు 'కోరస్'గా.

స్త్రీని గౌరవించాలనే నాగరికులూ, విద్యార్థులూ యిలా స్త్రీని అవమానపరచడంలో అర్థం యేమిటన్నట్లు బసవరాజు చూశాడు.

మొత్తానికి సినీమా పూర్తయింది. ఇద్దరూ బయటపడ్డారు.

'మీరేం హుషారుగా లేరే!—ఇంట్లో చెప్పలేదని బాధపడుతున్నారా? మీ పద్ధతేం నాకు నచ్చలేదు. 'గ్రాడ్యుయేట్' అదీగాక 'ఆర్టిస్ట్'—'డేరింగ నేచర్' కావాలి. ఎదురుగా శృంగార సామగ్రి వున్నప్పుడు నోటినిండా కీర్తించాలి' — యువకుడు గబగబ అంటున్నాడు. బసవరాజు ముఖంలోని మార్పులు యువకుడు గుర్తించలేక పోతున్నాడు. చీకటిలో దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. బసవరాజు మౌనంగా నడుస్తున్నాడు.

'నేను యిలా వెళతాను. రాత్రి నిద్ర పట్టడానికి యింతకన్న సాధనం లేదు. రేపు 'పార్క్'లో కలుద్దాం! గుడ్ నైట్!' — శరీర సుఖాలు ఖరీదుకు దొరికే పేటకు దారితీస్తూ యువకుడు మందహాసంతో మలుపు తిరిగాడు.

శని వదిలిందని నిట్టూర్చాడు బసవరాజు. జేబులో డబ్బులేల్లేవు. ఆకలి వేస్తోంది. ఇంటికి చేరితే భోజనం చేయొచ్చు, కాని నడిచి వెళ్ళాలి. 'ఉసూరో'మంటూ యింటికి చేరేసరికి అత్తయ్య మావయ్య వీధి గుమ్మంలో వున్నారు, బసవరాజుకోసం యెదురు చూస్తూ.

'ఏమిరా! ఎక్కడికి పోయావ్? ఈ వూళ్ళో 'రాష్ డ్రైవింగ్' —'యాక్సిడెంట్స్' తరుచుగా జరుగుతుంటాయి. నే నెంతో 'యాంగ్జైటీ' 'ఫీ'లవుతున్నాను.'

మావయ్య యెంతో ఆప్యాయంగా అడిగాడు.

'కాలేజీఫ్రెండ్' ఒకడు 'మెడికల్ రిప్రజెంటేటివ్'గా పని చేస్తున్నాడు, ఇవాళ క్యాంపు కొచ్చాట్ట యిక్కడికి — సెంటర్లో కనబడి 'పిక్చర్'కి లాక్కుపోయాడు. చెప్పే 'టైం'లేక పోయింది—సాయంత్రం వచ్చావా?' అన్నాడు బసవరాజు మామూలు ధోరణిలో, యాక్సిడెంటల్‌గా జరిగిన సంఘటనను—యాక్సిడెంటల్ అబద్ధంగా మార్చి.

'భోజనానికి తీసుకురాక పోయావా?'—అత్తయ్య అంది.

బసవరాజు గుండెల్లో రాయి పడింది. 'యాక్సిడెంట్స్' 'అకేషనల్'గా కాక 'యూజువల్'గా జరిగే విజయవాడ గాలి వంట బట్టింది. ఒక అబద్ధం ఆడినవాడు అబద్ధాల వలను సులభంగా అల్లగలడు.

'లేదత్తయ్యా! వాడు రాత్రి బండికి వెళ్ళిపోతాడు'—బసవరాజు అన్నాడు.

'టిఫిన్ గట్టిగా పడిందా?'—

'టిఫినేం ఖర్మమే—భోజనం చేసే వుంటారు. ఏరా చేశావా? చేస్తావా?'—మావయ్య అన్నాడు.

ఉన్నతంగా ఊహించి ఒక స్నేహితుణ్ణి గురించి చెప్పాక యిలాంటి చిన్న సందర్భంలో నిజం చెప్పేయడం బాగుండదు కనక బసవరాజు మరొక అబద్ధమాడాడు— 'భోజనం చేసి, వాడిని స్టేషన్లో దిగబెట్టి, మీరు కంగారు పడుతుంటారని వచ్చేశాను.'—

'అందుకే యింత ఆలస్యమయింది. పడుకో? పొద్దుటే మాట్లాడుకుందాం!'— మావయ్య అన్నాడు.

కాళ్ళే కాకుండా కడుపుకూడా పీకుతుండగా గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి మంచంమీద వాలాడు బసవరాజు.

ఏమిటి? ఆ యువకుడితో తనంత 'క్లోజు'గా తిరిగాడు. అయినా మనస్సు కలవలేదు. అతడు మాత్రం తనతో యెందుకు సన్నిహితమయాడు? ఏమైతే యింక ఆ మనిషి కనబడకూడదు.

నలుగురితో స్నేహం చేసుకోవడం అతడికి 'వ్యానిటీ' తనకు స్నేహం ఒక పవిత్రానుబంధం. స్నేహం చేసుకోవాలనే తపన యిద్దర్నీ కలిపింది. దృక్పథాలు వేరు కావడంతో విడదీస్తుంది.

సమాజాన్ని వేటాడుతూ విమర్శించడం అతడికి సరదా. సమాజాన్ని అర్థం చేసుకుంటూ గౌరవించడం బసవరాజు ఆదర్శం. ఎవరి పరిధి వారిది. ఆ పరిధులు దాటి రాలేనివారు మరల కలుసుకోలేరు, కలుసుకోవాలనుకోరు. ఆ పరిధులగురించి తెలియనంతవరకు జరిగే సంఘటనలు 'యాక్సిడెంట్స్', సన్నివేశాలు 'వ్యానిటీ'లు అంతే! ●


పైవారమే కొత్త సీరియల్ ప్రారంభం!

ఆరాధన

రచయిత్రి

యలమంచిలి ఝాన్సీలక్ష్మి